బాణసంచా దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - తణుకు రూరల్

బాణసంచా దుకాణాలకు పూర్తి అనుమతులు లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ డివిఎస్ఎస్.అశోక్‌వర్మ హెచ్చరించారు. దువ్వ వద్ద ఉన్న బాణసంచా దుకాణాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో విక్రయిస్తున్న టపాసులు వాటి నాణ్యత, ధరలను పరిశీలించారు. దుకాణాలకు సంబంధించిన అనుమతుల పత్రాలను పరిశీలించారు. అక్కడ తీసుకున్న జాగ్రత్తలను పరిశీలించారు. వినియోగదారులకు నాణ్యమైన బాణసంచా విక్రయించాలని వ్యాపారులకు సూచించారు. ఆయన వెంట ఆర్ఐ భవానీ, సిబ్బంది ఉన్నారు.

బాణసంచా దుకాణాలను తనిఖీ చేస్తున్న తహశీల్దార్ అశోక్‌వర్మ

'ఆశా'కు అన్యాయం..!

టి.నరసాపురం మండలం గండిగూడెం ఆశా వర్కర్‌పై అధికారుల నిరంకుశత్వం

విచారణ లేకుండా తొలగింపు, నోటిఫికేషన్ లేకుండానే మరొకరు నియామకం

స్థానిక మెడికల్ ఆఫీసర్, ఎంఎల్‌హెచ్‌పికు డిఎంహెచ్‌ఒ వత్తాసు

రాజకీయ నాయకులతో జత కట్టి నిబంధనలకు నీళ్లు

జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుంటేనే బాధితురాలికి న్యాయం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల నిరంకుశ వైఖరి మరోసారి చర్చనీయాంశంగా మారింది. చిరుద్యోగులైన ఆశా వర్కర్ల విషయంలో నిబంధనలకు తిలోదకాలిచ్చి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టి.నరసాపురం మండలం గండిగూడెంలో ఆశా వర్కర్ తొలగింపు వ్యవహారంలో వైద్యఆరోగ్య శాఖాధికారులు వ్యవహరించిన తీరు పరాకాష్టగా మారింది. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని, ఆశా వర్కర్‌కు న్యాయం చేయాలని ఆశా వర్కర్లతో పాటు రోజులుగా ఆందోళన నిర్వహిస్తున్నా జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారులకు పట్టని పరిస్థితి నెలకొంది. మెడికల్ సీట్ల కోటాపై ఇటీవల పిహెచ్‌సి డాక్టర్ల ఆందోళన సందర్భంలోనూ ఆందోళనలను అడ్డుకునేందుకు డిఎంహెచ్‌ఒ వ్యవహరించిన తీరు చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుంటే తప్ప ఆశా వర్కర్ సమస్య పరిష్కారమయ్యే పరిస్థితి కన్పించడం లేదు.

టి.నరసాపురం మండలం గండిగూడెం ఆశా వర్కర్ కె.లక్ష్మీమంగపై వైద్యఆరోగ్యశాఖ అధికారులు కక్షగట్టి వ్యవహరిస్తున్న పరిస్థితి తలెత్తిందని విమర్శలు విన్పిస్తున్నాయి. స్థానిక మెడికల్ ఆఫీసర్, ఆసుపత్రిలో పని చేసే ఎంఎల్‌హెచ్‌పి (మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్)ల వంతపాడుతూ ఆశా వర్కర్ లక్ష్మీమంగను తొలగించిన తీరు చర్చనీయాంశంగా మారింది. నోటీస్ ఇవ్వకుండా, విచారణ జరపకుండా తొలగించినట్లు ప్రకటించడమే కాకుండా నోటిఫికేషన్ ఇవ్వకుండా మరొకరిని ఆ పోస్టులో నియమించిన తీరు డిఎంహెచ్‌ఒ నిరంకుశ ధోరణికి నిదర్శనమనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాజకీయ నాయకులతో జతకట్టి వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఈవిధంగా వ్యవహరిస్తున్నారనే ప్రచారం పెద్దఎత్తున సాగుతోంది. ఆశా వర్కర్ పనితీరులో ఏమైనా లోపాలు ఉంటే మాట్లాడాలి, అప్పటికీ మారకపోతే నోటీసులు ఇవ్వాలి. పనిలో తీవ్రమైన తప్పిదాలు ఉంటే విచారణ చేసి చర్యలు తీసుకోవచ్చు. అలాకాకుండా మెడికల్ ఆఫీసర్, ఎంఎల్‌హెచ్‌పి చెప్పారని నిబంధనలకు విరుద్ధంగా ఆశా వర్కర్‌ను తొలగించడం ఏమిటో ఏ ఒక్కరికీ అర్థం కావడం లేదు. దీనివెనుక పెద్ద గూడుపుఠాణి జరిగినట్లు తెలుస్తోంది. వ్యక్తిగత కక్షతోనే ఆశా వర్కర్‌ను తొలగించినట్లు తెలుస్తోంది. పిహెచ్‌సిలో పనిచేసే అధికారులకు, ఆశావర్కర్ కుటుంబంలోని వ్యక్తులకు మధ్య ఉన్న తగాదాల కారణంగా ఆశా వర్కర్‌పై కక్ష సాధిస్తున్నట్లు పెద్దఎత్తున చర్చ సాగుతోంది. టిడిపికి చెందిన కొంతమంది నాయకుల అండతో స్థానిక వైద్యాధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆశా వర్కర్‌ను తొలగించాలంటే అందుకు సంబంధించిన మండలంలోని కమిటీ నిర్ణయం తీసుకోవాలి. కమిటీలోని కీలకమైన ప్రజాప్రతినిధి ఒకరికి అసలు విషయం చెప్పకుండా, సంతకాలు తీసుకుని ఇష్టానుసారంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. పూర్తిస్థాయిలో విచారణ జరిపి తప్పు తేల్చాల్సిన జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు చర్చ నడుస్తోంది. ఆశా వర్కర్‌ను తొలగిస్తూ ఆర్డర్ సిద్ధం చేసి ఇచ్చేందుకు సైతం సిద్ధమవ్వగా ఈలోపు సిఐటియు ఆధ్వర్యంలో ఆశాలు ఆందోళనకు దిగడంతో ఆర్డర్ కాపీ ఆమెకు ఇవ్వలేదని తెలుస్తోంది. ఆమె స్థానంలో మాత్రం వేరొకరిని నియమించి పనులు మాత్రం సాగిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఆశా వర్కర్‌ను తొలగిస్తే ఆ స్థానం ఖాళీగా ఉందని చూపించి, నోటిఫికేషన్ విడుదల చేసి నియామకం చేపట్టాలి. ఇక్కడ అటువంటి ప్రక్రియ ఏమీ లేకుండానే వేరొకరిని నియమించిన పరిస్థితి నెలకొంది. దీన్నిబట్టి జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి ఏవిధంగా వ్యవహరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. అనేక విషయాల్లో డిఎంహెచ్‌ఒ శర్మిష్ఠ తీరు వివాదాస్పదమవుతోంది. తాజాగా గండిగూడెం ఆశా వర్కర్ తొలగింపు సైతం మరోసారి చర్చనీయాంశంగా మారింది. నీట్ సీట్ల కోటాకు సంబంధించి ఇటీవల పిహెచ్‌సి వైద్యులు ఆందోళనకు దిగగా వారు వేసిన టెంట్లు తొలగించి బెదిరింపు పర్వానికి దిగిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదేవిధంగా ఆశావర్కర్ విషయంలోనూ వ్యవహరిస్తున్న తీరు మరోసారి చర్చకు దారితీసింది. రాజకీయ కక్ష సాధింపులకు అధికారులు వత్తాసు పలకడం ఏమిటో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఆశా వర్కర్ విషయంలో జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుంటే తప్ప సమస్య పరిష్కారమయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. స్థానిక ఎంఎల్ఎ సైతం జోక్యం చేసుకుని ఆశా వర్కర్‌కు న్యాయం చేయాలని అంతా కోరుతున్నారు.

ఆశా వర్కర్‌కు మద్దతుగా ఆందోళన చేస్తున్న ఆశావర్కర్లు

నిబంధనలు పాటించకుండా తొలగింపు దారుణం

ఆర్.లింగరాజు, సిఐటియు జిల్లా అధ్యక్షులు

ఆశా వర్కర్ విషయంలో మరోసారి విచారణ చేయిస్తానని డిఎంహెచ్‌ఒ హామీ ఇచ్చి నిర్లక్ష్యంగా పక్కన పెట్టేశారు. వెంటనే విచారణ చేసి తగిన న్యాయం చేయాలి. చట్టవిరుద్ధమైన ప్రొసీజర్ ఏకపక్షంగా అమలు చేయకుండా ఆశావర్కర్‌ను తొలగించడం దారుణం. ఆశా వర్కర్ తొలగింపునకు సంబంధించి మండలస్థాయి కమిటీ తీర్మానం లేదు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా సమస్యను పరిష్కరించాలి.

నోటీసు, విచారణ లేకుండా ఏవిధంగా తొలగిస్తారు

కె.పోశమ్మ, ఎపి ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి

పిహెచ్‌సిలో తప్పు చేసిన వ్యక్తిని తొలగించకుండా తప్పు చేయని ఆశావర్కర్‌ను తొలగించడం అత్యంత దారుణం. నోటీస్, విచారణ లేకుండా ఏవిధంగా తొలగిస్తారో అధికారులు చెప్పాలి. మెడికల్ ఆఫీసర్, ఎంఎల్‌హెచ్‌పి తీరు ఏమాత్రం బాగోలేదు. ఖాళీ అయినట్లు నోటిఫికేషన్ ఇవ్వకుండా కొత్త వ్యక్తిని ఏ నిబంధనల ప్రకారం నియమించారో చెప్పాలి. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తాం.

నూతన మద్యం పాలసీకి వ్యతిరేకంగా నిరసనలు

ప్రజాశక్తి - యలమంచిలి

కూటమి ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మద్యం పాలసీని వ్యతిరేకిస్తూ గాంధీ జయంతిని పురస్కరించుకొని మండలంలోని చించినాడ గ్రామంలో అరుంధతిపేట, పెదపేట, విప్పర్తివారిపేట తదితర ఏరియాల్లో ఐద్వా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కోశాధికారి సరిపల్లి జయప్రభ మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర ధరలను పక్కనపెట్టి కుటుంబాలను రోడ్డున పడేసి విచ్చలవిడిగా మద్యం విక్రయాలు చేసుకునే అవకాశం కల్పిస్తూ గతంలో కంటే బెల్టు షాపులను రెట్టింపు చేస్తూ ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గపు చర్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఐద్వా ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో ప్రజలను, మహిళలను చైతన్యపర్చి పెద్దఎత్తున ఆందోళనలు చేయడానికి వెనకాడేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు జిల్లెల్ల ప్రశాంతి, గొల్ల విజయకుమారి, ముస్కుడి జయశ్రీ, సెట్టిమి నాగమణి, పల్లేరు సుభద్ర, తెన్నేటి పార్వతి, పల్లేరు స్వర్ణలత పాల్గొన్నారు.

చించినాడలో నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు

ఆకివీడు : మద్యం షాపుల సంఖ్యను విపరీతంగా పెంచుకుంటూ పోయి ఆఫర్ల పేరుతో మద్యాన్ని ఏరులై పారించడం సమంజసం కాదని ఐద్వా పట్టణ కార్యదర్శి సందక ఉదయకుమారి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నూతన మద్యం విధానాన్ని నిరసిస్తూ ఐద్వా ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని గేటు వద్ద ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయకుమారి మాట్లాడుతూ మద్యం అమ్మకాలను ప్రభుత్వం ఆదాయ వనరుగా చూడడం సిగ్గుచేటు అన్నారు. విద్య, వైద్యం, ఉపాధి అంశాలపై దృష్టి పెట్టకుండా ఉచిత పథకాలు అంటూ రాజకీయం చేయడం తగదన్నారు. ప్రభుత్వం వెంటనే నూతన మద్యం విధానాలను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో డోకల లక్ష్మీ, ఎ.కృష్ణవేణి, బి.కృష్ణవేణి, జివి.లావణ్య, రమణలక్ష్మి పాల్గొన్నారు.

గరగపర్రులో హైటెన్షన్

శ్మశానవాటికకు దారి విషయంలో దళితులు, ముస్లింలకు మధ్య వివాదం

ఆక్రమణలు తొలగించి దారి ఇవ్వాలని దళితుల డిమాండ్

ఇరుపక్షాల మొహరింపుతో ఉద్రిక్తత: రంగంలోకి పోలీసు బలగాలు

వారం రోజుల్లో సమస్య పరిష్కారానికి హామీతో ఇరుపక్షాల ఆందోళన విరమణ

ప్రజాశక్తి - పాలకోడేరు

గరగపర్రులో బుధవారం హైటెన్షన్ వాతావరణం నెలకొంది. శ్మశాన వాటిక దారి విషయంలో దళితులు, ముస్లింలకు మధ్య వివాదం తలెత్తింది. ఈ నేపథ్యంలో ఇరుపక్షాలు ఎదురెదురుగా రోడ్డుపైకి చేరడంతో ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. దీంతో పోలీసులు భారీగా మొహరించారు. సర్వేనెంబర్ 384/2లో 4.58 ఎకరాలు ఎస్‌సి శ్మశానవాటిక భూమిగా ప్రభుత్వ రికార్డుల్లో ఉంది. ఈ భూమిలో కొంతభూమిని ఎస్‌సిలు శ్మశానవాటికగా వినియోగించుకుంటున్నారు. మరికొంత భూమికి పూర్వం పంచాయతీ ఇళ్ల పట్టాలు ఇచ్చింది. సుమారు 53 మంది ఈ భూమిని ఆక్రమించుకుని ఇళ్లు కూడా నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారు. మొత్తంగా ఎకరం 49 సెంట్లు భూమి ఆక్రమణకు గురైంది. ఇదిలా ఉంటే మరో 28 సెంట్లు భూమిని మసీదు నిర్మాణానికి పంచాయతీ కేటాయించింది. అయితే ఆక్రమణలు పెరగడంతో దళితులు శ్మశానవాటికకు వెళ్లేందుకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ఆక్రమణలు తొలగించి శ్మశానవాటిక భూమిని తమకు అప్పగించాలని 2017లో అప్పటి కలెక్టర్, తహశీల్దార్‌కు దళితులు వినతిపత్రాలు సమర్పించారు. అయితే దీనిపై కనీస చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. ఈ క్రమంలో తమ శ్మశాన వాటికకు దారి ఏర్పాటు చేసుకునేందుకు దళితులు బుధవారం జెసిబితో చదును చేసేందుకు ప్రయత్నించారు. దీన్ని ముస్లింలు అడ్డుకుని మసీదు వైపు నుంచి శ్మశానానికి దారి కుదరదని అభ్యంతరం తెలిపారు. మసీదు ఎదుట వారు బైఠాయించడం, దానికి ప్రతిగా రహదారిపై దళితులు బైఠాయించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో భీమవరం టూటౌన్ సిఐ కాళీచరణ్, భీమవరం రూరల్ సిఐ శ్రీనివాసరావు, కాళ్ల ఎస్ఐ శ్రీనివాసరావు, ప్రత్యేక పోలీసు బలగాలతో అక్కడికి చేరుకుని ఇరుపక్షాలకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఉద్రిక్తత సడలకపోవడంతో ఇరుపక్షాలను అక్కడి నుంచి చెదరగొట్టారు. దీంతో భీమవరం-తాడేపల్లిగూడెం రహదారిపై సుమారు రెండు గంటలపాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీనిపై పోలీసులు జోక్యం చేసుకుని ఇరుపక్షాలకు సర్దిచెప్పి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. అనంతరం శ్మశానవాటిక, మసీదు ప్రాంతం, మిగిలిన ఖాళీ భూమిని సిఐలు కాళీచరణ్, శ్రీనివాసరావు, ఆర్ఐ కె.రాఘవరాజు, విఆర్‌ఒ ఎన్.కోటేశ్వరరావు పరిశీలించారు. అనంతరం స్థానిక సచివాలయంలో ఇరుపక్షాలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత సమస్యలను తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లి వారం రోజుల్లో శ్మశాన భూమిని సర్వే చేసి సమస్యలను పరిష్కరిస్తామని ఆర్ఐ రాఘవరాజు హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు.

ఇరుపక్షాలతో సమావేశాన్ని ఏర్పాటు చేసిన అధికారులు

మా శ్మశాన భూమి మాకు అప్పగించండి

అడ్వకేట్ విల్లింగ్ స్టాన్

శ్మశాన వాటిక భూమి ఆక్రమణలకు గురికావడంతో శ్మశాన వాటికకు వెళ్లేందుకు దారి లేకుండాపోయిందని తమ శ్మశాన భూమిని తమకు అప్పగించాలని అడ్వకేట్ విల్లింగ్‌స్టాన్, దళితులు డిమాండ్ చేశారు. స్థానిక సచివాలయంలో వారు సమస్యలను విలేకరులకు విన్నవించారు. గ్రామంలో 500 దళిత కుటుంబాలు ఉన్నాయని, రికార్డుల్లో పూర్వం నుంచి శ్మశానవాటికగా ఉన్న భూమినియ పలువురు ఆక్రమించుకున్నారన్నారు. కొంతమంది ఇళ్లు కూడా నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారని చెప్పారు. శ్మశాన వాటికకు వెళ్లేందుకు కనీసం దారి లేదని, చిన్నపాటి వర్షానికీ మోకాళ్ల లోతు నీరు వచ్చి చేరుతుందని వాపోయారు. ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్న కుటుంబాలను మినహాయించి మిగిలిన భూమిని సర్వే చేసి తమకు అప్పగించాలని కోరారు. సమస్యలను విన్నవించిన వారిలో ఎలిషా, చిన్న, పేతురు, యోహాను, యేసు, యాకోబు, ఆదాము ఉన్నారు.

హిందువులకు శ్మశానవాటిక కేటాయించాలి

గ్రామంలో హిందువులకు ఎక్కడా శ్మశాన వాటిక లేదని, తమకూ శ్మశాన వాటికను కేటాయించాలని పలువురు అధికారులను కోరారు. సచివాలయంలో జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ గ్రామంలో హిందువులకు శ్మశానవాటిక లేకపోవడంతో ఎవరైనా చనిపోతే భీమవరం తీసుకెళ్లి దహన సంస్కారాలు చేసుకోవాల్సిన దుస్థితి ఉందన్నారు. ఆక్రమణలో ఉన్న దళితుల శ్మశాన వాటికలో కొంతభాగాన్ని హిందూ శ్మశాన వాటికగా కేటాయించాలని, దీనికి దళిత సోదరులు సహకరిస్తామని చెప్పారని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీ మూర్తి

భీమవరంలో యుటిఎఫ్ ఆధ్వర్యాన సత్యాగ్రహ దీక్ష

ప్రజాశక్తి - భీమవరం

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి డిమాండ్ చేశారు. గాంధీజీ జయంతిని పరిస్కరించుకుని భీమవరంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమీపాన ఉన్న గాంధీజీ విగ్రహానికి యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, జిల్లా అధ్యక్షుడు పిఎస్.విజయరామరాజు, జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం యుటిఎఫ్ ప్రాంతీయ సమన్వయ కర్త సిహెచ్.పట్టాభిరామయ్య అధ్యక్షతన జరిగిన సత్యాగ్రహ దీక్షలో గోపీమూర్తి మాట్లాడారు. సుదీర్ఘకాలం నుంచి అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిపిఎఫ్ అకౌంట్లు ప్రారంభించాలని, పండిట్, పిఇటి పోస్టులు అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు పిఎస్.విజయరామరాజు మాట్లాడుతూ వెంటనే బదిలీలు, ప్రమోషన్స్ చేపట్టాలని కోరారు. అనంతరం వినతిపత్రాన్ని గాంధీజీ విగ్రహానికి అందజేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమవరం పట్టణ ప్రధాన కార్యదర్శి కెవి.మల్లేశ్వరరావు, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.అబ్రహం, బి.నాగబాబు, పాలకోడేరు మండల ప్రధాన కార్యదర్శి కె.త్రిమూర్తులు, ఎం.శ్రీనివాస్, కె.సత్యనారాయణ, ఎం.శివరామరాజు, వి.సత్యస్వరూప్ పాల్గొన్నారు.

భీమవరంలో సత్యాగ్రహ దీక్షలో నిరసన తెలియజేస్తున్న యుటిఎఫ్ నేతలు

నరసాపురం : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యాన గాంధీ జయంతి సందర్భంగా బుధవారం మున్సిపల్ ఉపాధ్యాయులు గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.మార్కండేయులు మాట్లాడుతూ మున్సిపల్ హైస్కూళ్లలో తగినంత మంది సబ్జెక్టు టీచర్లను నియమించేందుకు వీలుగా ఎస్‌టి, పండిట్, పిఇటి పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. నవంబర్‌గా అప్‌గ్రేడెడ్ పోస్టుల్లో మున్సిపల్ టీచర్లకు ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. మున్సిపల్ ప్రధానోపాధ్యాయుల్లో అర్హులైన వారిని అర్బన్ ఎంఇఒలుగా నియమించాలన్నారు. మున్సిపల్ టీచర్లకు జిపిఎఫ్ ఖాతాలు తెరిపించాలన్నారు. నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు జిఎస్ఎస్ఆర్.స్వామి, నరసాపురం పట్టణ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నంబూరి చంద్రకుమార్, ఎం.మాణిక్యాలరావు, వైబి.శ్రీనివాస్, ఎం.సుధీర్, ఫణికుమార్ పాల్గొన్నారు.

స్వచ్ఛతా కార్యక్రమాలు ఉద్యమంలా చేపట్టాలి

కేంద్ర పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

స్వచ్ఛతా కార్యక్రమాలు దేశ పౌరులందరూ ఒక ఉద్యమంలా చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల్లో భాగంగా ముగింపు ఉత్సవాలను బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ హాజరు కాగా, ప్రత్యేక ఆహ్వానితులుగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎంఎల్‌ఎలు పులపర్తి రామాంజనేయులు, పితాని సత్యనారాయణ, కనుమూరి రఘురామకృష్ణంరాజు, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, డిఆర్‌ఒ జె.ఉదయభాస్కరరావు పాల్గొన్నారు. తొలుత మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని గాంధీజీ విగ్రహానికి కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, జిల్లా కలెక్టర్, శాసనసభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇదే రోజు లాల్ బహదూర్ శాస్త్రి పుట్టినరోజు కూడా కావడంతో వేదికపై ఏర్పాటుచేసిన లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ శాంతి దూత జాతిపిత గాంధీజీ అన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, కలెక్టర్ చదలవాడ నాగరాణి, భీమవరం, ఉండి, ఆచంట ఎంఎల్‌ఎలు అభినందించారు. ఈ కార్యక్రమంలో జెసి టి.రాహుల్‌కుమార్ రెడ్డి, డిఆర్‌ఒ జె.ఉదయ భాస్కరరావు, జిల్లా అడిషనల్ ఎస్పి వి.భీమారావు, కెఆర్‌ఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ బి.శివనారాయణరెడ్డి, ఆర్‌డిఒలు పాల్గొన్నారు.

కార్మికులను సత్కరిస్తున్న కేంద్ర మంత్రి వర్మ, కలెక్టర్, ఎంఎల్‌ఎలు పితాని, త్రిబుల్ ఆర్, అంజిబాబు

గాంధీజీ మార్గం అనుసరణీయం

జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

మహాత్మా గాంధీ మార్గం అనుసరణీయమని, నేటి యువత గాంధీజీ స్ఫూర్తితో ముందడుగు వేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గాంధీజీ జయంతిని పురస్కరించుకొని స్థానిక పాత బస్టాండ్ సెంటర్ బాంబే బేకరి ఎదురుగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ రాణి పాల్గొని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గాంధీజీ జయంతిని అంతర్జాతీయ అహింసా దినోత్సవంగా పాటించే సాంప్రదాయం 2007 నుంచి ప్రారంభమైందన్నారు. గాంధీజీ ఆలోచనలు, భావాలు సిద్ధాంతాలు ఎందరికో స్ఫూర్తిగా నిలిచాయన్నారు. నేటి యువత ఆయన బాటలో అడుగులేస్తూ దేశ ప్రగతికి తోడ్పడాలన్నారు. అహింస అనే ఆయుధంతో సహాయ నిరాకరణ సత్యాగ్రహం వంటి పోరాటాలు చేసి దేశ స్వాతంత్రం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమ నోడల్ అధికారి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ బి.నాగేశ్వరరావు, తహశీల్దార్ రావి రాంబాబు, పంచాయతీరాజ్ డిఇలు పి.శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా బుధవారం జిల్లా ఎస్పి కార్యాలయంలో ఎస్పి అద్నాన్ నయీం అస్మీ గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేడు యువత ఆ మహాత్ముని ఆదర్శాలను అనుసరిస్తూ శాంతి, సమానత్వం, మతసామరస్యాన్ని పాటిస్తూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ నాగరాణి

బ్లడ్ బ్యాంకులో రక్త నిల్వలు పెంచాలి

నిరుపేదలకు మొదటి ప్రాధాన్యతివ్వాలి - కలెక్టరు నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రాయలంలో జిల్లా రెడ్‌క్రాస్ కార్యాలయం, కపొనెంటు బ్లడ్ బ్యాంకు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి బుధవారం పరిశీలించారు. ఇంటర్నేషనల్ రెడ్‌క్రాస్ సహకారంతో సమకూర్చుకున్న రూ.2 కోట్ల విలువైన యంత్రాలు, పరికరాలు, మౌలిక సదుపాయాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. నేషనల్ సెంట్రల్ డ్రగ్ అథారిటీ న్యూఢిల్లీ వారి నుంచి బ్లడ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు లైసెన్స్ మంజూరు చేయడం జరిగిందని, జిల్లా కలెక్టర్‌కు జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ తెలిపారు. యంత్రాలు, పరికరాలు పనిచేసే విధానాన్ని తెలుసుకుని జిల్లా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రక్త దాతలను ప్రోత్సహించి, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కృత్రిమంగా రక్తాన్ని తయారు చేయలేమని, దాతల నుంచి మాత్రమే రక్తాన్ని సేకరించగలమని, ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని తెలిపారు. సాధ్యమైనంత తొందరలో బ్లడ్‌బ్యాంకు కేంద్రాన్ని ప్రారంభించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలన్నారు. రూ.2 కోట్ల విలువైన ఎక్యూప్‌మెంట్ అందించిన ఇంటర్నేషనల్ రెడ్ క్రాస్ సంస్థ, ఇండియన్ రెడ్‌క్రాస్, జిల్లా రెడ్ క్రాస్ శాఖకు కలెక్టరు ధన్యవాదాలు తెలిపారు. ఆమె వెంట తహశీల్దార్ రావి రాంబాబు, జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ ఛైర్మన్ ఎం.శివరామ భద్రిరాజు, కోశాధికారి కె.తిరుపతిరాజు, ఎంసి సభ్యులు కె.రఘు సీతారామ కృష్ణంరాజు, సిహెచ్‌వి.ఫణి, కె.రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సిబ్బందితో జిల్లా కలెక్టర్ నాగరాణి

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలి

రెండో రోజు కొనసాగిన నిరసన దీక్షలు

ప్రజాశక్తి - భీమవరం

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా భీమవరంలో సాగుతున్న నిరసన దీక్షలు బుధవారం రెండో రోజు కూడా కొనసాగాయి. దీనిలో భాగంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నేతలు, విద్యార్థులు దీక్షలో కూర్చుని నిరసన తెలిపారు. ఈ దీక్షలను పట్టణ పౌర సమాఖ్య జిల్లా కన్వీనర్ ఎం.వైకుంఠరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రసాద్, ప్రజా నాట్యమండలి జిల్లా నాయకులు సీతారామప్రసాద్ ప్రారంభించి మాట్లాడారు. 32 మంది ప్రాణాల బలిదానంతో ఏర్పాటైన విశాఖ ఉక్కును ప్రయివేటు పరం చేయాలని చూడడం దారుణమన్నారు. దేశంలో అతి పెద్ద ఉక్కు పరిశ్రమలో ఒకటైన విశాఖ ఉక్కు ప్రయివేటుపరం అయితే యువత, విద్యార్థులు ఉపాధి అవకాశాలు కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలు అర్పించైనా ప్రయివేటీకరణను అడ్డుకుంటామని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో విద్యార్థులు, యువకులతో పెద్ద ఎత్తున పోరాటాలకు నాంది పలుకుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వర్, పట్టణాధ్యక్షులు ఎన్.పవన్, పట్టణ కార్యదర్శి బి.గణేష్, ఎస్.లక్ష్మణ్, శ్రీను, రోహిత్ పాల్గొన్నారు.

పోరాట యోధుడు సీతారాం ఏచూరి

ప్రజాశక్తి - పెనుగొండ

పోరాట యోధుడు సీతారాం ఏచూరి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం తెలిపారు. బుధవారం సిద్ధాంతంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఏచూరి సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. కార్మిక హక్కుల కోసమే సీతారాం విశేష కృషి. 22 సంవత్సరాల వయస్సు నుండే ఏచూరి ప్రజల కోసం పనిచేయాలని నిర్ణయం తీసుకోవడం ఉన్నతమైందన్నారు. కార్మికులు, రైతుల హక్కుల కోసం నిరంతరం పనిచేసిన పోరాట యోధుడని కొనియాడారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ మాట్లాడుతూ పార్లమెంట్ సభ్యుడిగా పేదల కోసం అటవీ హక్కుల చట్టం, ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కుల చట్టం రూపొందించడంలో కీలకంగా పనిచేసిన నాయకుడని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నుంచి సిఐటియు నేత వీరవల్లి రాము, సిపిఎం గ్రామ కార్యదర్శి కప్పల రత్నరాజు, కార్మికులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంతెన సీతారాం

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న జనవిజ్ఞాన వేదిక కన్వీనర్

విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేత

ప్రజాశక్తి - నరసాపురం

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో గెలుపొందిన విద్యార్థులకు బుధవారం బహుమతుల ప్రదానం చేశారు. యుటిఎఫ్ భవనంలో జనవిజ్ఞాన వేదిక నరసాపురం కన్వీనర్ ఆకెన రామకృష్ణ ఆధ్వర్యంలో మండల, పట్టణ స్థాయిలో చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ పరీక్షలో మహాత్మా జ్యోతిబాఫూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల(బాలికలు) 34 మార్కులతో మండల స్థాయిలో మొదటిస్థానం పొందగా, 31 మార్కులతో జెడిపి హైస్కూల్ యర్రంశెట్టి వారి పాలెం 2వ స్థానంలో, 28 మార్కులతో జిల్లా పరిషత్ హై స్కూల్ చిట్టవరం మూడవ స్థానంలో నిలిచింది. పట్టణ స్థాయిలో మున్సిపల్ హై స్కూల్ టేలర్ పేట్ 26 మార్కులతో మొదటి స్థానంలోనూ, ఎన్ఎస్ఆర్ మున్సిపల్ హై స్కూల్ 2, 3 స్థానాలో(రెండు టీంలు పాల్గొన్నాయి) నిలిచాయి. విజేతలందరికీ జనవిజ్ఞాన వేదిక తరఫున బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, జి.సుబ్బారావు, డేనియల్ అరవింద్, జివిఎస్ఆర్ స్వామి, జిఆర్.సునీల్ కుమార్, అడపా శ్రీను, పి.అయ్యప్ప నాయుడు పాల్గొన్నారు.

కొత్తపల్లిని కలిసిన ఆర్‌డిఒ దాసిరాజు

ప్రజాశక్తి - నరసాపురం

మాజీ మంత్రి, జనసేన నాయకుడు కొత్తపల్లి సుబ్బారాయుడుని ఆయన నివాసంలో నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ దాసిరాజు సుబ్బారాయుడుకు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఇరువురు సబ్ డివిజన్‌లోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించుకున్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

ప్రజాశక్తి - నరసాపురం

పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయించాలని నరసాపురం 6వ సచివాలయ ఎఎన్ఎం పుష్పవతి అన్నారు. పట్టణంలోని పాత్ రోడ్డు ఎంసిహెచ్ సెంటర్‌లో బుధవారం వైద్య సిబ్బంది పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు వేశారు. పిల్లలకు వయసు వారీగా క్రమం తప్పకుండా టీకాలు వేయించాలన్నారు. టీకా వేసిన అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలను తల్లులకు వివరించారు.

ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల శ్రమదానం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఎస్ఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గాంధీ జయంతి సందర్భంగా కళాశాల, పేరుపాలెం బీచ్‌లో క్లీనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజారాజేశ్వరి అధ్యక్షతన కళాశాలలో క్యాంపస్ క్లీనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది, విద్యార్థులు జాతిపిత చిత్రపటానికి పూలమాలలు వేసి స్వాతంత్ర ఉద్యమంలో గాంధీజీ గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. అనంతరం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్స్ 1, 2, ఇతర అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను పేరుపాలెం బీచ్ క్లీనింగ్‌కు తీసుకుని వెళ్లారు. పేరుపాలెంలో నెహ్రూ యువ కేంద్రం వెస్ట్ గోదావరి వారి ఆధ్వర్యంలో బీచ్ క్లీనింగ్ కార్యక్రమం క్లీన్ డ్రైవ్‌లో పాలకొల్లు విద్యార్థులు చురుకుగా పాల్గొని బీచ్‌లో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం మొదలైన వాటిని సేకరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ వి.విజయలక్ష్మి, కె.శివకృష్ణ, వి.శిరీష, బి.ఆశాజ్యోతి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, వివిధ శాఖలు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

వైసిపి రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆచంట

వైసిపి రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డిని బుధవారం తాడేపల్లిలో వైసిపి రాష్ట్ర యువజన కార్యదర్శి చెల్ల కిషోర్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, వెంకటేశ్వర స్వామి జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి కార్యకర్త, నాయకుడికి అండగా ఉంటానని, పార్టీ బలోపేతానికి కృషిచేయాలని కోరారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిసిన వారిలో మండల ప్రధాన కార్యదర్శి మనపర్తి విజయ్ కుమార్, మడిమెట్ల నరేష్ ఉన్నారు.

కార్మికులకు చేయూతనివ్వాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

రాష్ట్రంలో ఉండరూ చేనేత వస్త్రాలు ధరించి ఆ వృత్తిలో ఉన్న కార్మికులకు చేయూతనివ్వాలని జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు అల్లాడ సూర్య భాస్కర్ రావు కోరారు. బుధవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ మహాత్మా గాంధీ ఆశయాలు నిజం చేయాలంటే ప్రతీ ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించడం అలవాటు చేసుకోవాలని అన్నారు.

మంతెన రామరాజుకు సత్కారం

ప్రజాశక్తి - నరసాపురం

ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్‌గా నియమితులైన టిడిపి జిల్లా అధ్యక్షుడు, ఉండి మాజీ ఎంఎల్ఎ మంతెన రామరాజును నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ సన్మానించారు. బుధవారం నరసాపురం జనసేన కార్యాలయానికి విచ్చేసిన రామరాజుకు పుష్పగుచ్చం అందించి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నరసాపురం టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు పాల్గొన్నారు.

ఆచంట : ఏపీఐఐసి రాష్ట్ర ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన మంతెన రామరాజు ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. పోడూరు మండలం కొమ్ముచిక్కాలలో ఎంఎల్ఎ నివాసంలో కలిసి కాసేపు ముచ్చటించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని మంతెన రామరాజు అన్నారు. ఈ సందర్భంగా రామరాజును ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కట్టా రాంబాబు, వివరిల్లి శ్రీనివాస్, పిన్నమనేని శ్రీనివాస్, జుత్తుగ శ్రీనివాస్, చిన్నంశెట్టి హరినారాయణ పాల్గొన్నారు.

పవన్ ఆశయ సాధనకు కృషి

జనసేన ఇన్‌ఛార్జి నాగరాజు

ప్రజాశక్తి - కాళ్ల

జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జనసేన ఉండి ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు కోరారు. జనసేన విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం బుధవారం బొండాడ గ్రామంలో నిర్వహించారు. తొలుత బొండాడ, బొండాడ పేట, ఎల్ఎన్ పురం గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన జనసేన జెండా స్తూపాలను ప్రారంభించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ మండలాధ్యక్షుడు ఎరుబండి రామాంజనేయులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మూడు గ్రామాలకు చెందిన వైసిపి నాయకులు రుద్ర వెంకటరావు, తానింకి రాము, పద్మగోళ్ల అంజనేయులు, కందుల సురేష్, మండపాటి సోమన్న, కొరసేన నాగరాజు, గుడ్ల సతీష్‌తో పాటు సుమారు 250 మంది నాయకులు నాగరాజు సమక్షంలో జనసేనలో చేరారు.

జనసేనలో చేరుతున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజా పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

గ్రామ స్వరాజ్యానికి పాటుపడాలి

గాంధీ జయంతి వేడుకల్లో జెసి రాహుల్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

బాపూజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి మనమంతా నిరంతరం పాటుపడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలోని గాంధీ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటే దేశాభివృద్ధి సాధ్యమని, గాంధీజీ ఆశయానికి అనుగుణంగా స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. మన ఇంటిని ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో మన చుట్టూ వున్న పరిసరాలను అంతే శుభ్రంగా ఉంచాల్సిన భాధ్యత మనపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, కెఆర్‌ఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ బి.శివనారాయణ రెడ్డి, డ్వామా పిడి కెసిహెచ్.అప్పారావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు, జిల్లా ఐసిడిఎస్ అధికారి బి.సుజాతా రాణి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, జిల్లా కలెక్టరేటు సిబ్బంది పాల్గొన్నారు.

పెనుమంట్ర : మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా మానవతా మండల సంస్థ తరుపున పారిశుధ్య కార్మికులను కమిటీ సత్కరించింది. బుధవారం మార్టేరు శ్రీవేణుగోపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతిపిత మహాత్మా గాంధీ 156వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిర్ల చిన్న సూర్యనారాయణ రెడ్డి గాంధీ విగ్రహానికి నూలు మాల వేసి, నివాళులర్పించారు. అనంతరం పారిశుధ్య కార్మికులు నాగమణి, అప్పలకొండలను శాలువాలతో సత్కరించి, వారి



పెనుమంట్ర : నివాళులు అర్పిస్తున్న మానవత సభ్యులు

సేవలను కొనియాడారు. మానవత కోశాధికారి చదువుల వెంకట నరేంద్ర, సెక్రటరీ ఎస్.మురళీకృష్ణ, రీజనల్ ఛైర్మన్ బాణాల శ్రీనివాస్, ఛైర్మన్ కడలి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు బండి ప్రసాద్ పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయాలను అందరూ ముందుకు తీసుకుని వెళ్లాలని వాసవీ క్లబ్ సభ్యులు కోరారు. బుధవారం మార్టేరు, పెనుమంట్ర, బ్రాహ్మణ చెరువు, పొలమూరు, తదితర గ్రామాల్లో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. బ్రాహ్మణ చెర్వు గాంధీ బొమ్మ సెంటర్‌లో జరిగిన వేడుకల్లో సిపిఎం మండల నాయకులు కూసంపూడి సుబ్బరాజు, దిండి కుటుంబ సభ్యులు పాల్గొని పలువురు విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ చేశారు.

గణపవరం : స్వాతంత్ర సాధనకు గాంధీ పోరాటమే నేటి యువతకు ఆదర్శమని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం కాలేజీలో జయంతి సభ ఘణంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపల్ నిర్మలాకుమారి మాట్లాడుతూ గత 15 రోజులుగా కొనసాగుతున్న స్వచ్చతా హి సేవ ముగిసిందని అన్నారు. వైస్ ప్రిన్సిపల్ వై.మధురాజు, ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 పిఒ పి.భాస్కరరావు, జి.వెంకటరమణ, టి.అక్కిరాజు, కె.స్వరూపరాణి పాల్గొన్నారు.

కాళ్ల : గాంధీ అహింసా మార్గంతోనే దేశానికి స్వాతంత్రం సాధించామని, ప్రతిఒక్కరూ మహాత్ముడిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగినప్పుడే దేశం సర్వోన్నతి చెందుతుందని ఉండి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు అన్నారు. మండలకేంద్రంలో గాంధీ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. గాంధీ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు ఆర్థిక సాయంతో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సోడదాసి గంగయ్య, కాంగ్రెస్ నాయకులు కొండా రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఆచంట : దేశానికి స్వాతంత్రాన్ని తెచ్చేందుకు అహింసనే ఆయుధంగా చేసుకున్న మహాత్మా గాంధీ ఆలోచనలు ఆచరణీయమైనవేనని ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి అన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గాంధీ పుట్టినరోజు వేడుకలు మండలంలోని ఆచంట, కొడమంచిలి, పెదమల్లం, కోడేరు, కరుగోరుమిల్లి, కందరవల్లి, భీమలాపురం, వల్లూరు, పెనుమంచిలి, శేషమ్మ చెరువు, అయోధ్య లంక గ్రామాల్లో వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఇఒపిఆర్‌డి మూర్తి బాబు, నాగిరెడ్డి, ఎంపిటిసి దాసిరెడ్డి పుణ్యవతి, నేతలు కేత మురళీ, మానేపల్లి సత్యనారాయణ, నెక్కంటి ప్రభాకర్‌రావు, సుబ్బారావు, వివిధ గ్రామాల సర్పంచులు, వివిధ పార్టీల నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భీమవరం : గాంధీకి నివాళులర్పిస్తున్న జెసి

నరసాపురం: గాంధీ జయంతి, ఖైదీల సంక్షేమ దినోత్సవం సందర్భంగా నరసాపురం ఉప కారాగారంలో జైల్ పర్యవేక్షణాధికారి టి.అప్పారావు అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) జి.గంగ రాజు, అదనపు సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) కె.శ్రీనివాస్ పాల్గొన్నారు. జైల్ అధికారి టి.అప్పారావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మహాత్మగాంధీ జయంతిని ఖైదీల సంక్షేమ దినోత్సవంగా జరపడం జరుగుతోందని అన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు చేగొండి బాలాజీ, మాజీ అధ్యక్షులు చల్లా దానయ్య నాయుడు, నామినేటెడ్ సభ్యులు వైడి.ఫణికర్, నరసాపురం, భీమవరం కోర్టులకు సంబంధించిన ఉచిత న్యాయ సలహాదారులు పాల్గొన్నారు. ఖైదీలకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి ముఖ్యఅతిథి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

లేస్‌ట్రేడ్ సెంటర్‌లో..

అంతర్జాతీయ లేస్ ట్రేడ్ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఇంటెర్నేషనల్ లేస్‌ట్రేడ్ సెంటర్ కన్వీనర్ కలవకొలను తులసి స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం లెప్రసీ హాస్పిటల్ సందర్శించారు. అక్కడ హెచ్ఐవి, లెప్రసీ రోగులకు పండ్లు, బ్రెడ్‌లను పంపిణీ చేశారు.

మహాత్మా గాంధీ అన్ని తరాలకు ఆదర్శప్రాయం అని నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. నరసాపురం స్థానిక పార్టీ కార్యాలయంలో మహాత్మా గాంధీ 155వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ అహింసా మార్గంలో స్వాతంత్ర సంగ్రామాన్ని నడిపించిన యోధుడు మహాత్మా గాంధీ, ఆ మహనీయుడు జయంతి సందర్భంగా నరసాపురం జనసేన నుంచి నివాళులు అర్పిస్తున్నామన్నారు.

పాలకొల్లు రూరల్: ఉల్లంపర్రు డాక్టర్ సబిత మాంటిస్సోరిస్‌లో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలవేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన నేటి యువతపై గాంధీ ప్రభావం అనే అంశం విద్యార్థులచే డిబెట్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన పాలకొల్లు ఎక్సైజ్ సిఐ మద్దాల శ్రీనివాసరావు మాట్లాడారు. క్షీరపురి సత్సంగ, యోగ వ్యవస్థాపకులు జవ్వాజి కళ్యాణ్, కళాశాల సెక్రెటరీ కరస్పాండెంట్ మద్దాల వాసు, ప్రిన్సిపల్ సామవేదం వసంతలక్ష్మి పాల్గొన్నారు.

పెనుగొండ : స్వాతంత్ర పోరాటంలో మహాత్మా గాంధీ ముఖ్యపాత్ర పోషించారని పెనుగొండ సర్పంచి నక్క శ్యామలసోని అన్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. గాంధీ బొమ్మ సెంటర్లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో, గాంధీ బొమ్మ సెంటర్లో గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆర్య వైశ్యులు పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద గాంధీ విగ్రహానికి మాజీ ఎంఎల్‌సిలు మేకా శేషుబాబు, అంగర రామ్మోహన్‌లు వేరువేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేకా శేషుబాబు ఎంసెట్‌లో మంచి ర్యాంకు సంపాదించి ప్రగతి ఇంజనీరింగ్ కాలేజీలో సీటు సాధించిన షేక్ అబ్దుల్ కుమార్తె షేక్ షాదిదాకు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. కాసాని కేశవరావు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో జరిగిన గాంధీ జయంతి కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విజయ సారధి, ఇంజనీర్లు రాజ్‌కుమార్, సాంబశివుడు, సతీష్ పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా టిడిపి నేతలు పెచ్చెట్టి బాబు, జివి పాల్గొన్నారు.

పాలకొల్లులోని జివిఎస్‌వి ఆర్ఎం మున్సిపల్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జనసేన టౌన్ ఉపాధ్యక్షుడు విన్నకోట గోపి, 28వ వార్డు జనసేన ఉపాధ్యక్షులు అల్లపల్లి చందు, సంగినీటి హరీష్, ఆనం సందీప్, చిప్పాడ సాయి, జామి మనోజ్, బన్నీ, కుశ్వంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

యునైటెడ్ కాపు సంఘం సారధ్యంలో స్థానిక కొత్తపేట స్కూల్లో విద్యార్థులకు ఉచితంగా నవోదయ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ గవర్నర్ పెనుమాక రామ్మోహన్, అధ్యక్షులు జక్కంపూడి మదన్, కార్యదర్శి వేరుకొండ దుర్గాప్రసాద్, కోశాధికారి శిరిగినీడి నాగార్జున పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరులోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో గాంధీ చిత్రపటానికి, గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి పంచాయతీ సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ నివాళులర్పించారు. స్థానిక శ్రీవాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాలు ఆర్యవైశ్య సంఘ సభ్యులు ఎస్ఎంఆర్ నాగేశ్వరరావు, అనంత పల్లి సాయిరామ్, అనిల్, కారుమూరి నాగబాబు, రమేష్, రవి, పంచాయతీ పాలకవర్గ సభ్యులు ఉన్నారు.

నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు గాంధీ జయంతిని పురస్కరించుకుని గ్రామంలో ప్రధాన కూడలిలో మొక్కలు నాటారు. గ్రామాల్లోని ప్రజలకు మొక్కలను పంపిణీ కార్యక్రమం చేశారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచి అడ్డాల సూరిబాబు, గుబ్బల నాగరాజు, నాగిడి రాంబాబు, తిరుమాని శ్రీనివాసు, దొంగ శ్రీను పాల్గొన్నారు.

ఉండి : గాంధీ జయంతి సందర్భంగా ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు వారి సేవలను కొనియాడారు. ఉండి రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, గ్రామ అధ్యక్షులు కాగిత బుజ్జి, పొత్తూరి వెంకటేశ్వరరాజు, గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

తణుకు : గాంధీ జయంతి పురస్కరించుకుని తణుకు పట్టణంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి, కోర్టు ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహానికి టిడిపి కూటమి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

తణుకు : గాంధీకి వినతిని అందజేస్తున్న గీత కార్మికులు

తణుకు : ఓ మహాత్మా గీత కార్మిక పాలసీని వెంటనే ప్రకటించమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు చెప్పండి అంటూ గీత కార్మికులు గాంధీజీ విగ్రహానికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈమేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న గాంధీజీ విగ్రహం వద్ద కార్మికులు నిరసన తెలిపారు. కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి మాట్లాడుతూ ఏటా అక్టోబర్ ఒకటో తేదీన కల్లుగీత కార్మికుల పాలసీని ప్రభుత్వం ప్రకటించేదని తెలిపారు. అయితే ప్రభుత్వం ఎక్సైజ్ పాలసీ కంటే లిక్కర్ పాలసీని ప్రకటించడం సిగ్గుచేటన్నారు. గీత కార్మిక సమస్యలను పరిష్కరించకపోతే రాబోయే కాలంలో గీత కార్మికులు పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతారని మునిస్వామి తెలిపారు. గీత కార్మిక సంఘం నాయకులు గుబ్బల వీరరాఘవులు, బుర్ర సత్యనారాయణ, కట్టా వెంకటేశ్వరరావు, భాగం శ్రీరాములు, పాల సత్యనారాయణ, కాసాని శ్రీను, చిట్టూరి ఆదినారాయణ పాల్గొన్నారు.

నిజమైన సేవకులు పారిశుధ్య కార్మికులు



పాలకొల్లు రూరల్ : సర్టిఫికెట్ అందుకుంటున్న హరిబాబు

ప్రజాశక్తి - వీరవాసరం

పంచాయతీ నిర్వహిస్తున్న పారిశుధ్య నిర్మూలనలో ప్రజలు కూడా బాధ్యతగా మెలగాలని సర్పంచి చికిలే మంగతాయారు అన్నారు. గాంధీ జయంతి పురస్కరించుకుని బుధవారం సర్పంచి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఆమె మాట్లాడుతూ అపారిశుధ్య ప్రాంతాలను తన దృష్టికి తీసుకురావాలన్నారు.గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఆయనకు నివాళి అర్పించారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సత్కరించి దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి కార్యదర్శి విజయ సారధి, ఉప సర్పంచి బోను రుక్మిణి దేవి, వార్డు సభ్యులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పెనుమంట్ర : గ్రామాల్లో ఉదయం నుంచి పరిసరాల పరిశుభ్రత కోసం శ్రమించే పంచాయతీ పారిశుధ్య కార్మికులే నిజమైన సేవకులని మార్టేరు గ్రామ సర్పంచి మట్టా కుమారి రాము, ఉప సర్పంచి కర్రి వేణుబాబు అన్నారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా ఎనిమిది మంది పంచాయతీ పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలు అందించి, శాలువా, పూల మాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు, సిబ్బంది, కూటమి పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : మండలంలో సెప్టెంబర్ 17వ తేదీ నుంచి ఈనెల 2వ తేదీ వరకు ప్రభుత్వం నిర్వహించిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా ప్రజలలో, విద్యార్థులలో అవగాహన కల్పించి, ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు విజయవంతం చేసిన సందర్భంగా పారిశుధ్య కార్మికుడు హరిబాబుకు ఉత్తమ సేవా అవార్డును జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, ఉండి ఎంఎల్ఎ కలిదిండి రఘురామకృష్ణరాజు చేతులమీదుగా అందజేశారు. మహాత్మ గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఈ అవార్డు అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని హరిబాబు తెలిపారు. ఈ సందర్భంగా హరిబాబును డిఎంహెచ్ఒ డి.మహేశ్వరరావు, అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ భానునాయక్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్ఎ డాక్టర్ సిహెచ్.సత్యనారాయణ మూర్తి అభినందనలు తెలియజేశారు.

వీరవాసరం : పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న సర్పంచి

గణపవరం : స్వచ్ఛత హి సేవాలో భాగంగా స్థానిక పంచాయతీ పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. సభలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జనసేన నాయకులు తోట శ్రీనివాస్, టిడిపి నాయకులు కూసంపూడి సురేంద్రకుమార్ రాజు, గ్రామ కార్యదర్శి డి.శివ ప్రసాద్ పాల్గొన్నారు.



గణపవరంలో కార్మికులను సత్కరిస్తున్న టిడిపి, జనసేన నేతలు

టిడిపి కార్యకర్త కాదు..!

అధికారులు కోర్టు ఆదేశాలు అమలు చేయాలి

కుప్పనపూడి రైతుల డిమాండ్

ప్రజాశక్తి - ఆకివీడు

తమ గ్రామంలో రైతులు వరిచేలకు, చేపల చెరువులకు నీరందకుండా కొత్త కొత్త కారణాలు సృష్టిస్తూ.. కోర్టు నుంచి స్టే ఆర్డర్లు చేస్తున్న వ్యక్తిని తగిన విధంగా శిక్షించి అవసరమైతే గ్రామం నుంచి పంపించేయాలని మండలంలోని కుప్పనపూడి గ్రామ రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామంలో ఎం.రాజు అనే వ్యక్తి తాను టిడిపి నాయకుడనని చెప్పుకుంటూ కోర్టు ఆదేశాలు సైతం అధికారులు అమలు చేయకుండా అడ్డుపడుతున్నారని వారు వివరించారు. బుధవారం గ్రామంలోని కమ్యూనిటీ హాల్‌లో పలువురు రైతులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అతను అనుమతి లేకుండా చేపల చెరువు తవ్వుకున్నాడని, ఆ చెరువులను వెంటనే కొట్టివేయాలని కోర్టు ఆదేశాలు ఇచ్చినా అధికారులు అమలు చేయడం లేదంటూ వారు కోర్టు ఉత్తర్వులను చూపించారు. టిడిపి కార్యకర్త అని చెప్పడం వల్ల అధికారులు భయపడుతున్నారన్నారు. అతను టిడిపి కార్యకర్త కాదని, వైసిపి కార్యకర్త అని, అందుకు సంబంధించిన ఫొటోలను ఆధారాలుగా వారు ప్రదర్శించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థికి బహటంగా ఆయన ప్రచారం చేశారని వారు చెప్పారు. వెంటనే తాము ఈ విషయాలను ఎంఎల్ఎ రఘురామ కృష్ణరాజుకు తెలిపి అతనిని టిడిపి నుంచి బహిష్కరించాలని, గ్రామం నుంచి పంపించివేయాలని కోరుతామన్నారు. గ్రామానికి మంజూరైన అంగన్వాడీ భవనాన్ని నిర్మాణం చేపట్టకుండా కోర్టు స్టే ఆర్డర్లు తీసుకొచ్చారని చెప్పారు. గ్రామంలో అనేక మంది రైతులు సాగునీరు లేక చాలా ఇబ్బంది పడుతున్నామని రైతులు వివరించారు. విలేకరుల సమావేశంలో జనసేన గ్రామ అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, గ్రామంలోని రైతులు బళ్ల బలరాం, బందారు మణి, నూకల రామదాసు, మాజీ ఉపసర్పంచి జన్ను గోపి పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, SIRUGUBATTULA JAYA BHARGAVI, D/o. S.NAGARJUNA, resident of D.No. 12-46, Thimmanavidu, Eluru Road, Venkateswara Theatre, Epuru, West Godavari Dist, (A.P)-521105. I have changed my name from SIRIGUBATTULA JAYA BHARGAVI (Old Name) to SIRUGUBATTULA JAYA BHARGAVI (New Name) for future all purposes.

దావా సమను

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ ఏలూరు, ప.గో.జిల్లా వారి కోర్టులో

ఎఫ్.డి.పి.నెం.4/2024 ఇన్ ఒ.యస్.నెం.275/2016

బిట్వీన్:
దిరిశాల సుబ్బారావు ...పిటీషనర్/వాది
మరియు
దిరిశాల అప్పారావు మరియు ఇద్దరు (2) ...రెస్పాండెంట్స్/ప్రతివాదులు
2వ రెస్పాండెంట్/2వ ప్రతివాది:
గాది రాజు విజయ నరసింహారాజు, తండ్రి సూరిబాబు, రాజుల కాలనీ, శనివారపుపేట, ఏలూరు మండలం, ఏలూరు, ప.గో.జిల్లా.

పై నెంబరు గల దావాలో 2వ రెస్పాండెంట్/2వ ప్రతివాది హాజరు నిమిత్తం శ్రీకోర్టు వారు పై నెంబరు దావాను ది.21-10-2024కు వాయిదా వేసినారు. కాబట్టి 2వ రెస్పాండెంట్/2వ ప్రతివాదిపై నెంబరు దావాలో 21-10-2024వ తేదీన ఉదయం 10.30 ని॥లకు స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని శ్రీకోర్టు వారి ఎదుట హాజరుకావలెను. అట్లు హాజరుకానిచో 2వ రెస్పాండెంట్/2వ ప్రతివాది పరోక్షమందు పై నెంబరు గల దావాను శ్రీకోర్టు వారు తీర్మానించెదరు అని తెలపడమైనది.
కోర్టు వారి ఉత్తర్వులు మేరకు
ఏలూరు **శ్రీ శేశెట్టి అప్పారావు,** అడ్వకేటు,
ది.03-10-24 ఏలూరు. సెల్:8341885888

IN THE COURT OF THE HON'BLE VIIth ADDL. DISTRICT JUDGE : ELURU

E.P.No.02/2021

O.S.No.177/2014

Between:
Sri Davuluri Hanumantha Rao ...DHR/Plaintiff
And
Smt.Gadde Venkata Lakshmi ...JDR/Defendant

పై నంబరు E.P లో JDR అయిన Smt. Gadde Venkata Lakshmi, W/o.Dharma Rao, R/o.D.No.4-58, Thimmapuram Village, D.Tirumala Mandal, W.G.Dist అను వారికి నోటీసుల అమలు కొరకు ది.4-10-24 వాయిదా అయివున్నది. సదరు వాయిదా రోజు పైకోర్టు వారి ఎదుట ఉ.10.30 గం॥లకు స్వయముగా గాని ప్లీడరు గారి ద్వారా గానీ వచ్చి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల వారి పరోక్షమందు సంగతులు తీర్మానించెదరు.
(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
ఏలూరు **E.Srinivasa Babu**
తేది.27.09.2024 Advocate, Eluru.

మహారాజశ్రీ సివిల్ జడ్జి - జూనియర్ డివిజన్ (ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి) వారి కోర్టులో

O.S.57/2023

Between:
తిరుమాని వంశీకృష్ణంరాజు ...వాది
మరియు
మేకా శ్రీధర్‌చౌదరి, S/o.సత్యనారాయణ, డోరునెం.14-10-10/10, భాస్కర్ కాలేజి ప్రక్కన, నరసాపురం.
మరియు ఇద్దరు ...ప్రతివాదులు

ప్రకటన

పై నెంబరు గ్రంథములో మీరు ఒకటవ ప్రతివాది అయివున్నారు. పై నెంబరు గ్రంథము ది.21-10-2024 తేదికి వాయిదా అయివున్నది. పై నెంబరు గ్రంథములో మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినప్పటికిన్ని మీకు అమలు జరుగనందున శ్రీకోర్టు వారు Substituted Service of Summons by way of Paper Publication ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున ఈ ప్రకటన ఇవ్వడమైనది. కావున మీరు ది.21-10-2024వ తేదీన మీరు స్వయముగా కాని/మీ యొక్క ప్లీడరు గారి ద్వారా కాని, ఉదయం గం॥10.30 ని॥లకు శ్రీకోర్టు వారి ఎదుట హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెయును. లేనియెడల సదరు గ్రంథము మీ యొక్క పరోక్షములో తీర్మానించబడును.
శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో
ఓ.ఎన్.కృష్ణ M.A.,M.B.A., M.Com., M.L.
నరసాపురం అడ్వకేటు, తణుకు-534211.
తేది.02.10.24 సెల్: 9848199440

IN THE HON'BLE COURT OF THE FAMILY JUDGE CUM IIIRD ADDL DISTRICT JUDGE AT VIZIANAGARAM MOP NO 63/2024

Between:
Majji Bharat Kumar ....Petitioner
And:
Pulagala Subhan Babu and others .....Respondent
To
R2. Nuthangi Maheswara Rao, S/o Srinivasulu, R/o D.No.2-138, Surya Nagar, Pydiparru, Tanuku, West Godavari Dist.

Please take notice that the above named Petitioner filed M.V.O.P. 63/2024 against you and others for Compensastion on Accident of Injuries Sustained by him in a Motor Accident and the above matter Stands Posted on **10-10-2024** Hence you are directed to attend before the Hon'ble Court in Person or through an Advocate by **10-30 A.M** on 10-10-2024 failing which the Hon'ble Court will be hard and determined in your absance and made ex-party orders as per law.

Sri K.Srinivasa Rao,
Advocate, Nellimarla,
Vizianagaram,
Cell No : 9440282934

IN THE HONBLE COURT OF THE FAMILY JUDGE CUM IIIRD ADDL DISTRICT JUDGE AT VIZIANAGARAM MOP NO 62/2024

Between:
Majji Vijaya Durga Prasanna ....Petitioner
And:
Pulagala Subhan Babu and others .....Respondent
To
R2. Nuthangi Maheswara Rao, S/o Srinivasulu, R/o D.No.2-138, Surya Nagar, Pydiparru, Tanuku, West Godavari Dist.

Please take notice that the above named Petitioner filed M.V.O.P. 62/2024 against you and others for Compensastion on Accident of Injuries Sustained by him in a Motor Accident and the above matter Stands Posted on **10-10-2024** Hence you are directed to attend before the Hon'ble Court in Person or through an Advocate by **10-30 A.M** on 10-10-2024 failing which the Hon'ble Court will be hard and determined in your absance and made ex-party orders as per law.

Sri K.Srinivasa Rao,
Advocate, Nellimarla,
Vizianagaram,
Cell No : 9440282934